AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

15-10-2026 (Thursday) MAIN EDITION

ఊరిస్తున్న డిఫెన్స్ కంపెనీ ఐపీవో



అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : డిఫెన్స్ సెక్టార్‌కు చెందిన టోంబో ఇమేజింగ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ మెయిన్ బోర్డు ఐపీవో ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చింది. ఐపీవో ద్వారా మొత్తం రూ. 852.18 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. కంపెనీ ధరల శ్రేణిని రూ. 665 నుంచి రూ. 700 గా నిర్ణయించింది. గ్రే మార్కెట్ ప్రీమియం ప్రకారం ఇన్వెస్టర్లకు 71 శాతం వరకు లాభాలు వచ్చే అవకాశాలున్నాయి. ఐపీవో అక్టోబర్ 15న ఓపెన్ అయ్యింది. 19 వరకు అందుబాటులో ఉంటుంది.

ఐపీవోకు పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: ప్రముఖ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ అయిన బాన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ లిమిటెడ్ కంపెనీ పబ్లిక్ ఇష్యూ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైంది. ఐపీవో ద్వారా రూ. 2,533.66 కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఐపీవో సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 15 న ప్రారంభమైంది. అక్టోబర్ 19 వరకు అందుబాటులో ఉంటుంది.

పబ్‌లో గొడవ.. ఐపీఎస్ అధికారి బదిలీ



అక్షరటుడే, ఏపీ : బెంగళూరు పబ్ వివాదం తర్వాత ఏపీ ఐపీఎస్ అధికారి వికాస్ మర్మత్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన ఇటీవల బెంగళూరు పబ్‌లో పోలీసులతో గొడవ పడ్డారు. దీంతో వారు కేసు నమోదు చేశారు. ఈ వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ క్రమంలో మర్మత్‌ను బదిలీ చేసి, పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

తెలంగాణలో నాలుగు రోజులు వర్షా లు




అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : రాష్ట్రంలో నేటి నుంచి 18వ తేదీ వరకు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు 'ఎల్లో' అలెర్ట్ జారీ చేశారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో ఈ వర్షా లు పడుతాయని పేర్కొన్నారు.

రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు ఆగ్రహం




అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో ఏర్పడిన విద్యుత్ సమస్యలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అధికారులపై నెపం తోసేయడం కాంగ్రెస్ పాలనకు అలవాటుగా మారిందని విమర్శించారు.

దేశంలో ఉగ్రదాడికి కుట్ర!



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : దేశంలో ఉగ్రదాడికి పాకిస్థాన్ టెర్రరిస్టులు కుట్ర పన్నుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సరిహద్దు గ్రామాల్లో డ్రోన్ల ద్వారా ఆయుధాలు జార విడిస్తున్నారు. అక్టోబర్ 12 అర్ధరాత్రి రాత్రి పాకిస్తాన్ నుంచి ప్రయోగించిన మూడు డ్రోన్లు రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లా రౌలాలో గల 12 కేడీ గ్రామం సమీపంలో ప్యాకేజీలను జారవిడిచాయి. ఇద్దరు యువకులు వాటిని తీసుకురావడానికి పొలంలోకి ప్రవేశించారు. ఏఎన్‌టీఎఫ్ సిబ్బంది వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ బ్యాగుల్లో ఆర్డీఎక్స్, ఐఈడీలు, పిస్టళ్లు, లైవ్ క్యాడ్రిజ్‌లు ఉన్నాయి.

నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు షాక్..



అక్షరటుడే, సినిమాడెస్క్ : బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు షాక్ ఇచ్చారు. దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. సీజేపీ నిరసనల్లో పాల్గొన్న తర్వాత ఆయనకు ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. ఇమ్రాన్ ఖాన్ అమెరికా పౌరసత్వం కలిగి ఉన్నాడు. భారత పౌరుడు కానప్పటికీ, నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఇమ్రాన్ ఖాన్‌పై ఇమ్మిగ్రేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్టోబర్ 28లోపు దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు.



మతం మారితే రిజర్వేషన్లు వర్తించవు

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత

మతం మారితే రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తికి అంతకు ముందు ఉన్న బీసీ రిజర్వేషన్ అర్హత ఉండదని గురువారం పేర్కొంది. ఒక వ్యక్తి మరో మతంలోకి మారితే అతని సామాజిక వెనుకబాటుతనాన్ని హిందూ సామాజిక వ్యవస్థ నుంచి హిందూయేతర సామాజిక వ్యవస్థకు బదిలీ చేయలేరని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. - అక్షరటుడే, నేషనల్ డెస్క్

కేసు నేపథ్యం..

తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో ఒక హిందూ దంపతులకు జన్మించిన పరమశివం అనే వ్యక్తి ఇస్లాంలోకి కన్వర్ట్ అయ్యాడు. అనంతరం తన పేరు సమీర్ అహ్మద్‌గా మార్చుకొని, ముస్లిం సంప్రదాయంలోనే వివాహం చేసుకున్నారు. అయితే తనను ఇంకా వెనుకబడిన వర్గానికి చెందినవాడినే అని గుర్తించాలని కోరుతూ గతంలో మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర జీవో ప్రకారం "ముస్లిం లెబ్బాయి"గా తనను గుర్తించే కమ్యూనిటీ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తహశీల్దార్ అతని దరఖాస్తును తిరస్కరించారు.

ఇతర మతంలోకి మారినంత మాత్రాన.. దానంతట అదే ఏదైనా నిర్దిష్ట వెనుకబడిన కుల వర్గంలో సభ్యత్వం లభించదని కోర్టు తెలిపింది. మతం మారిన ముస్లింలకు రిజర్వేషన్ కల్పించేందుకు తమిళనాడు ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ జారీ చేసింది. వెనుకబడిన తరగతులు, అత్యంత వెనుకబడిన తరగతులు, డినోటిఫైడ్ కమ్యూనిటీలు లేదా షెడ్యూల్డ్ కులాల నుండి ఇస్లాంలోకి మారిన వ్యక్తిని బీసీ (ముస్లిం)గా పరిగణించి, మత మార్పిడి తర్వాత రిజర్వేషన్ పొందేందుకు గాను, నోటిపై చేయబడిన 7 వర్గాలలో ఒకదానికి చెందిన వ్యక్తిగా కమ్యూనిటీ సర్టిఫికేట్ జారీ చేయడానికి అనుమతించింది. దీనిని హైకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. మత మార్పిడి కారణంగా రిజర్వేషన్ ప్రయోజనాన్ని కోల్పోకూడదని వాదించింది.

ఎలాంటి ప్రయోజనం పొందలేరు


1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు కూడా హిందువులు, బౌద్ధులు, సిక్కులు కాని వ్యక్తులకు షెడ్యూల్డ్ కుల హోదాను విస్తరించలేమని గుర్తిస్తోందని కోర్టు పేర్కొంది. అందులో పేర్కొనబడని మతంలోకి మారిన వ్యక్తి, తన పూర్వ కులానికి సంబంధించిన షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) కింద వెనుకబడిన తరగతికి సంబంధించిన ఎలాంటి రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందలేదని కోర్టు తెలిపింది. తమిళనాడు ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది.



కల్పవృక్ష వాహనంపై మలయప్పస్వామి

అక్షరటుడే, ఏపీ : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం మలయప్పస్వామి బకాసుర వధ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గజరాజుల ముందు నడక, మంగళవాయిద్యాల నాదం, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ప్రబంధ పారాయణం నడుమ వాహనసేవ వైభవంగా సాగింది.

అమెరికాలో ఆలయంపై సామూహిక కాల్పులకు కుట్ర



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికాలో హిందూ దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులు కలకలం రేపుతున్నాయి. తాజాగా చికాగో సమీపంలోని ఓ హిందూ ఆలయంపై సామూహిక కాల్పులకు కుట్ర పన్నిన 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించి అరెస్ట్ చేశారు. ఇల్లినాయిస్ రాష్ట్రంలోని పలాటైన్‌కు చెందిన అలెగ్జాండ్రోస్ పాపోరాకిస్‌ను ఈ ఘటనకు సంబంధించి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఒహియోలోని రిచ్‌మండ్ హైట్స్‌లో శ్రీ స్వామినారాయణ వడ్తాల్ ధామ్ మందిరాన్ని ధ్వంసం చేసిన ఘటన జరిగిన కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఈ తాజా ఉదంతం వెలుగులోకి రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ చీఫ్ ఇంజినీర్ సస్పెన్షన్



అక్షరటుడే, భువనగిరి : యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ దామరచర్లలో విధులు నిర్వహిస్తున్న చీఫ్ ఇంజినీర్ బి. సురేష్‌ను టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్ సస్పెండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు ఆరోపణల రావడంతో చర్యలు తీసుకున్నారు. ఎల్‌ఎన్‌వో నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో చీఫ్ ఇంజినీర్‌ను సస్పెండ్ చేయడం గమనార్హం.

డెయిరీ యూనిట్లపై దాడులు



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని పలు డెయిరీ యూనిట్లపై టీజీ సేఫ్ అధికారులు దాడులు చేశారు. గురువారం తెల్ల వారుజామున 5 గంటల నుంచే తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్రమైన వాతావరణంలో పాల ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. లైసెన్స్ లేకుండా యూనిట్లను నడపడం, ఉత్పత్తులను సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. కోల్డ్‌స్టోరేజ్ సౌకర్యాలున్న రిఫ్రిజిరేటెడ్ వాహనాలకు బదులుగా బస్సులు, డీసీఎం వాహనాల్లో రవాణా చేస్తున్న 3.6 టన్నుల కోవాను స్వాధీనం చేసుకున్నారు.

ఘట్‌కేసర్ సీఐపై సస్పెన్షన్ వేటు



అక్షరటుడే, మల్కాజ్‌గిరి : మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ సీఐపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఘట్‌కేసర్ సీఐ బాలస్వామిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. అంతేగాకుండా ఆయన సివిల్ వ్యవహారాల్లో తలదూర్చినట్లు సమాచారం. కొండాపూర్‌లో ఓ భూ వివాదం కేసు, మరో యువతి ఆత్మహత్య కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఆయనపై విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు.

లేడీ డాన్ సులోచన అరెస్ట్..!



అక్షరటుడే, ఏపీ: ఒకప్పుడు సాధారణ కూలీగా పని చేసిన కోనేటి సులోచన రాజకీయ నాయకులు, అధికారుల అండతో వందల కోట్ల రూపాయల భూములను అక్రమంగా ఆక్రమించింది. 'లేడీ డాన్'గా పేరు తెచ్చుకున్న ఈమెను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో అమాయకులను మోసం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాను నడిపిస్తున్న ఆమెపై ఇప్పటికే 14 చీటింగ్, భూ కబ్జాలు, హత్యాప్రయత్నం కేసులు ఉండగా రౌడీషీట్ కూడా నమోదై ఉంది. జిల్లా ఎస్పీ ధీరజ్, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ ప్రసాద్‌ల ఆదేశాల మేరకు వన్ టౌన్ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.

హైదరాబాద్‌లో కారు బీభత్సం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలో కారు బీభత్సం సృష్టించింది. కంచన్‌బాగ్‌లో, బాబా నగర్ ఫంక్షన్ హాల్ సమీపంలో అతివేగంగా వస్తున్న మహీంద్రా కారు డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన తర్వాత డ్రైవర్ పారిపోయాడు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్ మద్యం మత్తులో కారును అతివేగంగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.